ద్రోహి యెవరు?

ఇది చాలకాలంనాటి మాట. అయినా నాకు బాగా జ్ఞాపకం వుంది. అవి నాకు సంతోషపదివాల. నేనపుడు చిన్నఅబ్బాయిని. మాతండ్రిగారి వెంబడే మావూరు చుట్టుప్రక్కలంతా బండిమీద తిరిగేవాణ్ణి. ఆదినం జరిగింది ఇపుడు స్పష్టంగా నాకన్నులయెదుట గనపడినట్లుంది. ఆదినం సాయంత్రం యథాప్రకారం మాతండ్రి ఒంటెద్దుబండిలో నిర్విచారంగా కూర్చొని షైలుదేరాము. ఆబండివూపులకు నాకు నిద్ర వస్తూ వస్తూవుంది. ఏగ్రామందగ్గరికి, ఎంతదూరం వెళ్లామో తెలియదు. కాని మాతండ్రి ఎద్దువదిలించి బండి నిలిపే వేళకు నాకూ మెలకువ వచ్చింది. బండికెదురుగా ఒకప్రక్కగా మాల వెంకడు నిల్చునివున్నాడు బుజాన చినిగిన దుప్పటి వేసుకొని.

"ఏమిరా వెంకా! ఏమిగావాలి" అని అడిగాడు మానాన్న.

"నా చిన్నబిడ్డ శీనుగాడు ఎనిమిదిదినాలుగా జరంవచ్చి కానా బాధపడుతున్నాడు సామీ! ఏం చేయాలో తెలియకుండా అల్లాడుతున్నాం" అంటూ దయచేసి రక్షించరూ అన్నట్లు దీనదృక్కులతో వెంకడు చూస్తూ నిలబడుకున్నాడు చేతులుకట్టుకొని.

"అయితే వకమారు బిడ్డని చూడమంటావా!" అని దయను వెల్లిగక్కే కన్నులతో ప్రశ్నించాడు తిరిగి నాన్న.

"అంతమాత్రంచేస్తే మీపాదాలకాడ పడివుంటా సామీ! తెల్లవారి పట్నంలోకియెల్లి రామదాసు గారి పాదాలమీదబడి మొరెట్టుకుంటి దేవరాబిడ్డని చూడమని, వచ్చేదానికి యీల్లేదు బొమ్మన్నారు సామీ—"

వెంకడు ముగించలేదు. నాన్న బండిలోవున్న మందులసంచి తీసికొని రోడ్డుప్రక్కననే వున్న మాల గూడెంలో వెంకని పూరిగుడిశదగ్గరకు వెళ్లసాగాడు. నేనుగూడా గభాలున బండిలోనుండి క్రిందికిదూకి నాన్న వెంబడి పరిగెత్తాను. వెంకని పూరింటిముందు ఎండకు వానకు నిరాఘాటంగా త్రోవయిచ్చే పంచ వేసివుంది. అందులో వెంకడి పెళ్లాము కాబోలు, ఒకావిడ బిడ్డని చేతుల్లో ఎత్తుకొని వూపుతూవుంది. చుట్టూ నలుగురైదుగురు ఆడవాళ్లుచేరి యేమేమో మాట్లాడుకుంటూ వున్నారు.

మేము వచ్చిందిచూచి వారంతా లేచారు. వెంకడు బిడ్డను తనచేతిలోనికి దీసికొన్నాడు. తండ్రిగారు నిదానంగా పరీక్షించారు. ఎన్నో ప్రశ్నలడిగారు. ఆబిడ్డకు చైతన్యంవున్నట్టు కనపడలేదు. నా చిన్న హృదయం ఎందుచేతనో వూరక కొట్టుకో సాగింది. నాన్న అంతాపరీక్షించి "వెంకడూ! నీబిడ్డకేమీ భయంలేదు. త్వరలో బాగవుతుందిలే." అన్నారు.

ఎందుకో నా కమితసంతోషం వచ్చింది. వెంకని పెళ్ళాం "అయితే సామీ! నాబిడ్డ బతుకుతాడా!" అని ఆదుర్దాతో అడిగింది.

'భయంలేదు, ఇదో! ఈమందివ్వండి. నేను రేపు కూడా ఈదారిని వెళ్లేటపుడుచూస్తా. నాల్గురోజుల్లో గుణం గలుగుతుంది' అంటూ ఏదోమందిచ్చి బండి వద్దకు వచ్చారు. చేతులు పిసుక్కుంటూ వెంకడు గూడ బండివద్దకు వచ్చాడు. నాన్న బండెక్కాడు. వెంకడు చేతులుజోడిస్తూ 'దేవరోరు రక్షించారు. తమకేమీ మందుకర్చుకు యిచ్చుకోలేను. నా తో పెయ్యావుంది. తమరు సెలవిస్తే తోలుకొస్తాను,' అన్నాడు.

"నాకేమీ ఈవద్దులేవోయ్. పిల్లవాన్ని చూచుకో శ్రద్ధగా" అంటూ ఎద్దునదిలించాడు. సాగింది. ఇంతలో వెంకని యింటిపైపునుండి బాయ్ బాయ్

మంటూ చిన్న కుక్కపిల్ల బండివైపు వస్తూ కనపడ్డది. ఆ తెలుపురంగూ అదీ చూచేవేళకు ఎత్తుకొని ముద్దులాడా లనిపించింది నాకు. కుక్కపిల్ల నాకుగావాలనీ బండి నిలపమనీ నాన్నను బ్రతిమాలాను. ఇంతలో వెంకడు కుక్కపిల్లను నాకందిస్తూ మా నాన్నతో 'దీన్నైనా చిన్నసామి కివ్వడానికి సెలవివ్వాలి' అంటూ బండిలో విడిచాడు. నాన్న ఏమీ మాటలాడలేదు. అప్పుడు నాకు కలిగినసంతోషం ఎంతో చెప్పలేను.

నా చిరుతహృదయం ఎంతో గంతులేసింది. తండ్రిగారివలెనే నేను పెరిగి పెద్దవాణ్ణయి అందరికి సాయంచేస్తే వాళ్లు అంత దయా, కృతజ్ఞతా చూపుతారేమో అనుకున్నా. నేనుకూడా నాన్నగారిలాగే మందులిచ్చేది నేర్చుకోవాలి అనుకున్నా. కాని వెంకడు చెప్పాడే రామదాసు మందులివ్వడానికి వీల్లేదన్నాడని. అదెందుకూ?

"నాన్నా! రామదాసు వచ్చి ఆబిడ్డను ఎందుకు చూడలేదు."

"మాలవాళ్లంటే ఆయన కిష్టంలేదురా! వాళ్లకు రోగాలువస్తే మనమాదిరి బాధపడతారా అనుకుంటాడేమో!"

"మనమాదిరే గద నాన్నా?"

నాన్న నావీపుతడుతూ "ఔనురా! మనవూళ్లో వాళ్లంతా మాలవాళ్లకేమి చేయకూడదు దగ్గర చేర్చకూడదంటారు. నే నేమైనా ఎప్పుడైనా చేసినా నామీద గుఱ్ఱుమని వుంటారు. కాని దేవునికి మనమెంతో వాళ్లు అంతే" అన్నారు.

"నాన్నా, నేనుకూడా పెద్దయాక నీలాగే మాలవాళ్లకి సాయంచేస్తా. మాలపిల్లలికి మందులిచ్చి బ్రతికిస్తా" అని అన్నాను. నాన్న నాముఖంలోకి చూచి చిరునవ్వునవ్వి వూరకున్నాడు.

* * *

నేను పెద్దవాణ్ణై జ్ఞానం వచ్చేకొలది మా నాన్న అమ్మాకూడ మాలమాదిగలంటే ఎంతో జాలిఅనీ బీదా సాదా అంటే సాయం ఎంతైనా చేసేవారని తెలిసికో గలిగాను. ఇదంతా చూచే ఇరుగుపొరుగుకూ వూళ్ళో వాళ్లకుకూడా బహిరంగంగా కాకపోయినా లోలోపల మేమంటె కోపము అసూయా అని తెలిసికొన్నా. తండ్రిగారికి మావూళ్ళోవున్న గౌరవమూ, ఆయనకున్న ధనమూ, జ్ఞానమూ, పైగా వైద్యములో అమృతహస్తమూ లేకుంటే ఆయనకు జాలిగుండె వున్నందుకూ సంఘంలోని కట్టుబాట్లకు లెక్కించకుండా బీదన్నా మాలమాదిగలన్నా వారు చేసే సాయానికి ఎప్పుడో బహిష్కారమూ అవమానమూ పొందివుండేవారే.

మాతండ్రి మాతాత కేకపుత్రుడు. ఆయన చనిపోయేటప్పుడు కావలసినంత ధనమూ జమీందారులాంటి భూవసతీ గల్పించాడు. కొంతవఱకు ఇంగ్లీషు చెప్పించాడు. మాతండ్రి తరువాత శ్రద్ధతీసుకొని వుంటే ఎంతైనా చదువుకొని పెద్దపెద్ద వుద్యోగాలు చేసివుండేవాడే. కాని ఆయన ఉద్దేశం అదికాదు. అందుచేతనే వైద్యవిద్య చదివారు. అదికూడ బీదసాదల కెక్కువగా ఉపయోగపడాలనే. ఆయన ఉద్యోగంకూడా అదే.

* * *

దుఃఖమనేది నాపన్నెండోయేట మాతల్లి గతించిన తరువాతనే తెలిసింది. దాంతో తండ్రిగారి సంతోషం మాయమయింది. కాని నాటినుండీ నాన్న నామీద ఎక్కువశ్రద్ధ తీసుకోవడ మారంభించారు. నేనుకూడా వైద్యము చదవాలనే అభిప్రాయంతో పెంచుతూ వచ్చారు. మాయింట్లో మాతండ్రిగారు తనవిద్యార్థి కాలములో సేకరించిన అస్థిపంజరముండేది. దాన్ని గురించి నాన్న నాకు శారీరశాస్త్రాన్నిగురించి బోధ చేసేవారు. నాచదువుతోపాటు అదికూడా నేర్చుకున్నాను.

ద్రోహి యెవరు?

నాన్నగారి ఆదరణచే మృత్యుముఖమునుండి బైటపడిన వెంకడిబిడ్డ, శీను, ఆమాలగూడెం మొత్తానికి అందరూ మెచ్చుకుండే అల్లరి కుర్రాడులాగ తయారయ్యాడు. అదీ కాకుండా వాడు చిన్నప్పటినుండి పిల్లంగోవి వాయించడానికి నేర్చుకుంటూ వచ్చాడు. వాడెంత అల్లరిఅయినా అంటరానివాడని అనిపించుకున్నా వేణువుచేత బట్టితే అందరూనిల్చి వినేవారు. వాడూ వాళ్ల నాయనా కూడా నాన్నగారివద్దకి వస్తూవుండేవారు. నాన్న వానిని వేణువు వాయించమని ఎన్నోసార్లు సంతోషంగా వింటూవుండేవారు. వాడు తన తండ్రికిగాని తల్లికిగాని పనిపాటల్లో వుపయోగపడే వాడుకాడు. ఎప్పుడూ పిల్లంగోవి చంకలోపెట్టుకొని తిరిగేవాడు. వాన్నిచూస్తే నాకొకవిధమైన అభిమానం.

నేను మెడికల్ కాలేజిలోచేరి ఒక సంవత్సరమే అయింది. అప్పుడొకఘోరం జరిగింది. మావూళ్ళో మసూచివచ్చింది. మానాన్న అప్పుడుచేసిన సేవ నాకు మరుపురాదు. ఈ ఘోరానికి మొదట బలైనవారు శీను తలిదండ్రులు. పెద్దవాడైనా తినితిరుగుతూ తలిదండ్రులమీదనే ఆధారపడివుండే శీనుకిది అశనిపాతమైంది. నాకెంతో జాలేసింది. కాని నాగతికూడ అంతే అయింది. మానాన్న విధివిరామంలేకుండా తిరిగి రోగులను బాగుచేయడంలోనే కాలమంతా గడుపుతుండేవాడు. ఎలాగు అశ్రద్ధచేశారో వారికీ ఆ రోగంరాక తప్పిందిగాదు. తనకు దక్కకుండా అందరిని బ్రతికిస్తూవున్నందుకు కోపమువచ్చి ఆ మసూచిభూతం మానాన్ననుకూడ పొట్టబెట్టుకుంది. నాకన్నలూ తమ్ముల్లూలేకున్నా అమ్మానాన్నా నా ప్రపంచంఅంతా అనుకునేవాన్ని. అమ్మ పోయినప్పటినుండీ నాకేదోపోయినట్లు గనిపించేది. అందుచేత నాన్నను ఎప్పుడూ విడువకుండావుండేవాన్ని. అమ్మానాన్నకూడా లేనివారు ప్రపంచంలో ఏలాజీవిస్తారో నాకర్థమయేదిగాదు. వారిద్దరూమాత్రమేగాక 'నా' అనే వారెవరూ ప్రపంచంలో లేరనేటప్పటికి అధోలోకానికి క్రుంగిపోయాను. నాన్న నిజంగా పోయాడని నమ్మలేకపోయాను. ఏమిచేయాలో, ఎక్కడకెళ్లాలో చదవాలో మానెయ్యాలోకూడ తెలిసిందిగాదు. కావలసినంతడబ్బూ భూములూ ఇళ్ళూకలవానికి నాకేయిలా తోస్తే తిండితిర్థాలకులేక వుండడానికి యిల్లులేకుండావుండే శీనుగతి ఏమనిపించింది నాకు. నేనొకడే మావూళ్ళో, ముఖ్యంగా మాయింట్లో, వుండలేకపోయాను. అందుచేత సెలవులకు ముందుగానే బైలుదేరాను చెన్నపట్నం. నేను వూరువిడిచేముందుగా శీను జీవించేదానికి మార్గంలేక రుద్రారెడ్డి యింట్లో జీతానికి కుదిరాడనివిన్నా. ఆతని కెంతధనమూ, భూములూ, తదితర ఆస్తి, పలుకబడివున్నవో వానిలో లక్షింటపాలైనా దయాదాక్షిణ్యాలు, ధానధర్మాలు లేవు సరిగదా! బీదవాళ్లను హింసించడం ప్రతిదాన్లో మూర్ఖత్వం జూపడంలో స్పెషలిస్టు. మాలమాదిగలంటేనే అతనికి మంట. పనిపాటలులేకుండా తిరిగే శీనున్ని వాని వేణువునుచూస్తే అతడు మండిపడేవాడని చెప్పేవారు. అటువంటివాడెలా ఆతనివద్ద కుదిరాడో ఎలాకాలం గడుపుతాడో అనిపించింది. మాతండ్రి బ్రతికివుంటే వాని కాగతి పట్టనిచ్చివుండేవారుగాదు.

అయినా నా దుఃఖములో నాయవస్థలో ఈ విషయం నన్నంతగా బాధించలేదు. నేనుపట్నం వెళ్లిపోయాను. నాచదువు ముగించడానికి ఐదేళ్లుపట్టింది. అదెలాగో గడిచిపోయింది. ఈలోపల నాలో నొక పెద్దమార్పు కలిగింది. ధనవంతులై నావంటి విద్యార్థులతో తిరగడంవల్ల మాలమాదిగలన్నా, బీదలన్నా నాకంటె తక్కువవారని నేను సాధారణులకంటె ఉన్నతస్థానంలోవున్న వాన్ననీ అహంభావం మాత్రం పూర్తిగా ఆవహించింది. మాతలిదండ్రుల అభిప్రాయాలు నాలో మరుగుపడ్డాయి. నేను మావూరువచ్చి మాతండ్రిగారిలాగే ప్రాక్టీసు ప్రారంభించాను. కాని మాతండ్రి ఆశయాల్తో గాదు.

ఒకనాటిసాయంకాలం తలవనితలంపుగా శీను నన్ను చూడడానికి వచ్చేడు. నేను వూరికివచ్చి చాలాదినాలైనా అతనిసమాచారం నాకు స్మరణకి వచ్చిందిగాదు. అతని స్థితిమాస్తే చాలాదీనంగా కనపడింది; మనిషికూడా చిక్కిపోయాడు నన్ను చూడ్డంతోటే లేని ఉత్సాహం సంతోషం తెచ్చిపెట్టుకుంటూవున్నట్లు గనపడింది.

"ఏమిటీలా వచ్చావుశీ''అన్నాను అతని పరీక్షిస్తూ.

"తమ దర్శనంచేసి చాలా కాలంఅయింది. అదీకాకుండా తమరిపుడు నాకొక సాయంచేస్తారని వచ్చాను. దయయుంచండి బాబూ!" అన్నాడు ఆ దుర్తా వెళ్ళబుచ్చుతూ.

"ఏమిటో కానీ"అన్నా గంభీరంగా.

అతడు తన దీనస్థితినంతా వెళ్ళ గ్రక్కాడు. "బాబూ నేను రుద్రారెడ్డిగారివద్ద జీతానికి కుదిరి ఐదేండ్లయింది. ఈ కాలంలో నేనేమి బాధపడ్డానో ఎన్ని దెబ్బలుతిన్నానో దేవుడికెఱుక. ఎంతకష్టపడినా రాత్రింబగళ్లు పనిచేసినా కడుపునిండాకూడు దొరకకపోగా తిట్లు అపుడపుడూ తన్నులుకూడ భరింపనన్ని దొరుకుతున్నాయి. పిల్లంగోవంటే నాప్రాణం అని తమకు తెలుసుకదా. అదెపుడైనా ఎవరికితెలియకుండా ఒకనిముషం ఎత్తుకున్నానంటే ఇక నాస్థితి చెప్పనవసరం వుండదు. నే నాకొలువు ఎపుడెప్పుడు మానేద్దామని కాచుకొనివున్నా. తమదగ్గర కొలువుచేస్తా. మీఇష్టం వచ్చినంత యివ్వండి. నన్నుమాత్రం ఆ ఘోరనరకం నుండి తప్పించండి. నేను కొలంపుమానేసి యెక్కడపోయినా రెడ్డిగారిని తప్పించుకోలేను. తమదగ్గరుంటే ఆయన తమరినేమీ చేయలేడు. నాకు తమరే సాయం చేస్తే ఆజన్మాంతమూ కృతజ్ఞుడుగా వుంటాను." అని దీనంగా నావైపు చూచాడు.

"ఊహూ, నావద్దయిదివఱకే ఒకమనిషివున్నాడు. నిన్ను నేనుంచుకోవడం ఎందుకు?అక్కర్లేదు''అన్నాను కఠినంగా వానిస్థితికి నాలోవున్న జాలిమేల్కొంటూవున్నా.

"దయవుంచాలి. తాము—'' అంటూ ఏమొ ఆరంభించాడు కాని నేను వుత్తిమి చూపడంవల్ల వుపయోగంలేదనుకొని దండంపెట్టి తిన్నగా వెళ్లిపోయాడు.

మరుదినం తెల్లవారి ఏకో ఆలోచించుకుంటూ వీధమీద వరండాలోనిల్చునివున్నా. వీధిలో కత్తులు కటారులు బడితెలు పుచ్చుకొని గబగబావస్తూవున్న జనసమూహం గనపడింది. త్వరగాదిగి క్రిందికివెళ్లి వాళ్లనడిగాను ఏమిసమాచారమని. రుద్రారెడ్డి ఆరాత్రి తన యింటవద్దనున్న తోటలోనే తలపైన పెద్దగాయముతో చచ్చిపడివున్నాడనీ శీనుమాత్రం పరారిఅయినాడనీ వాన్ని వెదకడానికి పైలుదేరామని చెప్పారు. వాళ్లంతా రుద్రారెడ్డి జీతగాళ్లు రైతులు. వాడుకనపడతే చంపాలనే వెళ్లుతున్నారు. అమాలకుంక అంత పనిచేశాడనడంతోటే నాకువళ్లు మండింది. వానిపై ఎక్కడలేని కోపమువచ్చింది. 'సరే నేనుకూడవస్తాను వెదకడానికి మీరెక్కడికి వెళుతున్నా'రన్నా వారితో. వారు సమీపంలోవుండే గుట్టలోని పొదల్లోవుంటాడనీ ఎక్కడావెళ్లివుండడనీ అక్కడవెదకడానికి వెళ్లుతున్నామనీ చెప్పారు. నాకొకవిధమైన ఉద్రేకమూ ఆవేశమూ వచ్చాయి. ఆహంతకుని నిటారుగాచీల్చివేయాలన్నంత కోపంవచ్చింది. వారివెంట పైలుదేరాను.

గుట్టను సమీపించాము. తల కొకదిక్కున వెదకడానికి విడిపోయాము. ప్రతివాడూ చెట్టూ పుట్టా గాలించి చూస్తున్నాడు శీనుకోసరం. హత్య జేశాడనే నేరంక్రిందశీన్నుపట్టి వేటమృగములాగ ముక్కలు చేయాలని రాక్షసులవలెవారూ వాళ్లతోపాటు నేను కూడ యుక్తాయుక్తజ్ఞానం నశించి తిరుగుతున్నామనే సమాచారం నాకు జ్ఞాపకానికి రాలేదు.

నేను ఒకటే ఆవేశంతో వెదుకుతున్నా. పొదలమధ్య పోతూవుండి ఒక కఱ్ఱతగిలి కంపల్లోద్దు.

కాలు దెబ్బదగిలింది. లేచి ఇటూఅటూ చూచాను. ఆపొదలలో పలనక్క శీను వేణువు హృదయానికి ఆనించుకొని గ్రుడ్లుమిటకరిస్తూ కూర్చొనివున్నాడు. లేసుకూన్న కోపాన్ని కాలినొప్పి మరింత రెచ్చ గొట్టింది. జింకపిల్లమీద దుమికే పెద్దపులిలాగు వక్క దూకుతో శీనుమీదికి లంఘించి గొంతుపట్టుకున్నాను. "లే ద్రోహీ! హంతకుడా! నీపని ముగిసింది" అని గర్జించాను. చుట్టూ వెదకుతూవుండేవాళ్లను పిలువాలని ప్రయత్నించాను. శీను నాపట్టు విడిపించుకొని కాళ్లమీద పడ్డాడు. తలపైకెత్తి కాళ్లకు చేతులు పెనవేసి "దయవుంచండి; బాబూ వాళ్లని పిలువద్దు" అని వణుకుతూ కన్నీళ్లుకారుస్తూ దీనంగా మెల్లగా బ్రతిమాలాడు.

"హంతకుడవు. ద్రోహివి. నీమీదనా దయ!" అని విదళించాను.

"బాబూ! కరుణించాలి. నేను హత్యచేయలేదు. స్వసంరక్షణార్థం ప్రయత్నిస్తే అలాఅయింది. నేను చంపాలని ఎపుడూ అనుకోలేదు" అని వెక్కి వెక్కి ఏడవడాని కారంభించాడు.

"ఈ బూటకాలు నేను నమ్మతానవా నీ యభిప్రాయం" అన్నా హేళనగా.

"నమ్మండి. ఇది సత్యం. ఎంతమాత్రము అబద్ధం లేదు. నిన్న సాయంకాలం తనువద్దకి వచ్చి యింటికి వెళ్లాను. ఇది రెడ్డిగారికి తెలిసిందట. నేను తోటలో వుంటే ఒక పెద్దబెత్తంతో వచ్చి 'నీకు ఆనంద రావుతో ఏంపని? వుండు వెధవా నీ చర్మం ఊడదీస్తా'నంటూ మీదికి వచ్చారు. భయమేసింది. ఆలాంటిదెబ్బ లెన్నోతిని నేను ఇదివరకే అమితంగా బాధపడ్డా. అందుచేత దగ్గరున్న ఒక యిటికరాయి తీసి ఆయనవైపు విసరాను. దాంతో మెదలకుండా క్రిందపడిపోయాడు. నాకు భయమేసింది. ఎవరన్నా చూస్తే చంపేస్తారనీ ఈలా పారివచ్చా. బాబూ మన్నించండి. మీ పాదాలేగతి" అంటూ కన్నీరు అమితంగా కారుస్తూ ఇటూఅటూ దృష్టిపారించి నావైపు చూడసాగాడు.

[ఆనందరావు శీనును రక్షిస్తాడో, వాని శత్రువుల కప్పగిస్తాడో, తుదకు వారిరువురు ఏమవుతారో వచ్చే సంచికలో చదవండి.

చ. రా.]

గమనింపు

ఈమధ్య జరిగిన శ్రీ చల్లాయమ్మ స్మారకచిహ్నవ్యాసపోటీపరీక్షయందు "పతివ్రత లోకకల్యాణమున కెట్లు తోడ్పడును" అను విషయముపై వ్రాయబడిన మొత్తం 13 వ్యాసములలో యీక్రిందివారి రిరువురి వ్యాసములను ప్రథమ ద్వితీయములుగా నిర్ణయింపబడినవి.

1. శ్రీమతి ముదుంబి లక్ష్మీదేవిగారు,
   ఆంధ్రగీర్వాణవిద్యాపీఠం, కొవ్వూరు.
2. శ్రీమతి వేమరాజు సుశీలగారు,
   శ్రీరామపురం, భీమవరం.

యీవ్యాసము మేనెల "గృహలక్ష్మి"యందు ప్రకటింపబడును.

కార్యదర్శి,
శ్రీ రవీంద్రసారస్వతసమాజం, భీమవరం.